క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఏలేశ్వరంలో రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గోపీ దంపతులు

ఏలేశ్వరం: పట్టణంలో కోదండ రామాలయం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక వైఆర్‌పీ కాలనీలో మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి దంపతులు రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. దాతల సహకారంతో రామాలయం నిర్మిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎస్‌జీవీ సుబ్బరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విగ్రహం నిర్మాణానికి భూమిపూజ



కాళ్ల దొంగబాబు విగ్రహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శ్రీలత

కిర్లంపూడి: మాజీ ఎంపీటీసీ, దివంగత కాళ్ల దొంగబాబు కాంస్య విగ్రహం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేస్తున్న విగ్రహానికి గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



సీతంపేటలో దుర్గామీనాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

శంఖవరం: మండలంలోని సీతంపేటలో వేంచేసిన దుర్గామీనాక్షి అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు ఆదివారం తెలిపారు. ఏవీ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొమ్మనాపల్లి, సీతారాంపురం గ్రామాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కోడి పందేలాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మన్యవారిపాలెం గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై జగ్గంపేట పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడుల్లో కోడి పందేలు ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1020 స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట ఎస్సై రఘునందరావు తెలిపారు.

సన్ డే



నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు జాతీయ రహదారి

ప్రత్తిపాడు: భానుడు భగభగలాడుతున్నాడు. మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు తారా స్థాయికి చేరాయి. ప్రత్తిపాడులో అత్యధికంగా ఆదివారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండదెబ్బకు మధ్యాహ్నం రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో జనం భయపడుతున్నారు. ప్రస్తుత వేసవికాలంలో కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, అత్యవసర వేళ బయటకు వెళ్లే ఎండ నుంచి రక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బడులకు భరోసా

- పాఠశాలల అభివృద్ధికి చర్యలు
- పీఎంశ్రీ పథకంలో ఐదేళ్ల పాటు ఆర్థిక సాయం
- గత ప్రభుత్వంలో నాడు–నేడుతో మారిన స్కూళ్ల రూపురేఖలు



కిర్లంపూడి ప్రభుత్వోన్నత పాఠశాలలో కబడ్డీ కోర్టు



కిర్లంపూడిలో 200 మీటర్ల వాకింగ్ ట్రాక్ ఏర్పాటు



కాట్రావులపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఖో-ఖో మైదానం ఆధునీకరణ పనులు

కిర్లంపూడి: విద్యతోనే దేశ ప్రగతి సాధ్యమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఆర్థిక సాయం అందిస్తోంది. దీనిలో భాగంగా ప్రధాన మంత్రి స్కూల్ ఫండ్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే, విగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు ఈ సాయం అందుతుంది. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. పేస్–1, పేస్–2లలో ఎంపికైన ఒక్కో పాఠశాలకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేస్తారు.

జగ్గంపేట నియోజకవర్గంలో...

పీఎంశ్రీ పథకం అమలుకు నిర్దేశించిన 46 అంశాల ఆధారంగా జగ్గంపేట నియోజకవర్గంలోని గ్రామీణ పాఠశాలల్లో 60 శాతం మార్కులు దాటిన ఆరు పాఠశాలలను పీఎంశ్రీకి ఎంపిక చేశారు.

నాడు–నేడుతో ప్రగతి

నియోజకవర్గంలోని పాఠశాలల రూపురేఖలు ఇప్పటికే నాడు–నేడు పథకం ద్వారా సమూలంగా మారిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందాలనే ఉద్దేశంతో పాఠశాలను తీర్చిదిద్దడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు, డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపట్టారు.

మరిన్ని హంగులతో అభివృద్ధికి శ్రీకారం

ఈ పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. విద్యా బోధన, సదుపాయాల్లో నాణ్యతా ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చుతారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, వికలాంగులకు ర్యాంపులు, ప్రధానంగా క్రీడా మైదానాల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. స్కూల్లో ఏయే సదుపాయాలు ఉన్నాయి. మరే సదుపాయాలు కల్పించాలి అని పరిశీలించి దాని ప్రకారం నిధులు మంజూరు చేస్తున్నారు. క్రీడామైదానం ఆధారంగా కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా పీడీల సూచనలతో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, లాంగ్ జంప్, రన్నింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.

జగ్గంపేట నియోజకవర్గంలో ఎంపికైన పాఠశాలలు

మండలం	పాఠశాల	గ్రామం	విద్యార్థుల సంఖ్య
కిర్లంపూడి	శ్రీకొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాల,	కిర్లంపూడి	850
జగ్గంపేట	మహిళల గురుకులం పాఠశాల	జగ్గంపేట	650
గోకవరం	జెడ్పీ హైస్కూల్	గోకవరం	865
గండేపల్లి	జెడ్పీహైస్కూల్	మల్లేపల్లి	560
కిర్లంపూడి	జెడ్పీ హైస్కూల్	తామరాడ	450
జగ్గంపేట	జెడ్పీ హైస్కూల్	కాట్రావులపల్లి	620

దశల వారీగా నిధులు



పీఎంశ్రీతో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు మెరుగుపడతాయి. క్రీడా మైదానాలతో పాటు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను సమకూర్చుతారు. క్రీడా మైదానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచడానికి పీఎంశ్రీ వరమనే చెప్పాలి. కిర్లంపూడి, తామరాడ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం.

– ఎం.చిన్నారావు, ఎంఈఓ–2, కిర్లంపూడి

నాణ్యతా ప్రమాణాలతో క్రీడా మైదానాలు



పీఎంశ్రీ నిధులతో పాఠశాలల్లోని క్రీడామైదానాలను నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నాం. పాఠశాలల్లోని విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఆయా క్రీడలకు సంబంధించిన క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తాం.

– కె.శివాజీ , అసిస్టెంట్ ఇంజినీర్

ఎన్నికలు ఎప్పుడొచ్చినా మాదే విజయం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- పెద్దిపాలెంలో పర్యటన



పెద్దిపాలెంలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలో ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు అన్నివేళలా అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. ఫలితంగా కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పాటుపడాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, పార్టీ నాయకులు మాకా చంటిబాబు, లొండ బాబు, విత్తనాల నాగేశ్వరరావు, దేవర రాధాకృష్ణ, చెనంశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



కిర్లంపూడిలో గరగలను దర్శించుకుంటున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

తొండంగి: మండలంలోని పి.అగ్రహారంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రధాన సెంటర్‌లో దాతల సహకారంతో దుర్గామాత ఆలయాన్ని పునర్నిర్మించారు. విగ్రహ పతిష్ఠను పురస్కరించుకుని దుర్గామాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, మండల కన్వీనర్ బత్తుల వీరబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

నేడు నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో నూతనంగా నిర్మించిన నూకాలమ్మతల్లి ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10.22 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో భోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నారు. భక్తుల సహకారం రూ.కోటితో ఆలయాన్ని నిర్మించారు. కొత్త అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న జాతరోత్సవాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



లోవకొతూతరులో అమ్మవారి ఆలయం వద్ద పూజలు, హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న గరగల నృత్యం

కిర్లంపూడి: నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో నిర్వహిస్తున్న గరగ నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసం వద్ద ఆదివారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలగరగల నృత్యాన్ని ప్రదర్శించారు. ఆయనతో పాటు, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి

- పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు
- ఘనంగా నివాళులు

ఏలేశ్వరం: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలను లెక్కచేయని పొట్టిశ్రీరాములుకు తెలుగు ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. అనంతరం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కంచర్ల రమేష్, కార్యదర్శి ఇమ్మడిశెట్టి కృష్ణ, కోశాధికారి మణికంఠ, వెల్లంపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: అమరజీవి శ్రీరాములు జయంతి వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్‌ఎస్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.



జగ్గంపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొత్త కొండబాబు

జగ్గంపేట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను జగ్గంపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల ఆమరణ దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానేపల్లి బంగారాజు, ఆర్యవైశ్య సంఘం నేతలు కొత్త శ్రీరామకృష్ణ, దారా శ్రీనివాస్, మానేపల్లి వీర్రాజు గుప్తా, బొండా వీరసత్య, వి.నాగసత్య, కంచర్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

ప్రత్తిపాడు: స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకుడు నేతి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు కందిమళ్ల సామ్యేలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో..

జగ్గంపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం వైఎస్సార్ సీపీ నేతలు నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం ఆదేశాల మేరకు పార్టీ నేత రావుల గణేష్‌రాజా ఆధ్వర్యంలో నేతలు అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జగ్గంపేట టౌన్ అధ్యక్షులు కాపారపు ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు బొండా కాశీ, పార్టీ నేతలు గుర్రం మహాలక్ష్మి, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- నేడు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఏలేశ్వరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చే నెల 1వ తేదీ వరకూ పరీక్షలు జరగనునుండడంతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరగనున్నాయి.

933 మంది విద్యార్థులు

ఏలేశ్వరం మండలంలోని ఏలేశ్వరంలో నాలుగు పరీక్ష కేంద్రాలు, లింగంపర్తిలో ఒక పరీక్ష కేంద్రంలో ప్రైవేట్, రెగ్యులర్ విద్యార్థులు కలిపి 933 మంది పరీక్షలు రాయనున్నారు. మండల కేంద్ర మైన ఏలేశ్వరంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్, శ్రీవిద్యా స్కూల్, లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

కేంద్రాల పర్యవేక్షణ అధికారులు

పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా సూపరింటిండెంట్‌గా ఎస్. గణపతిరావు నియమితులయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 157 మంది విద్యార్థులు, సూపరింటిండెంట్‌గా ఎస్.లక్ష్మీతులసి, భాష్యం స్కూల్‌లో 257 మంది విద్యార్థులు, సూపరింటిండెంట్‌గా ఆర్.కల్యాణ్, శ్రీవిద్యా స్కూల్‌లో 120 మంది విద్యార్థులు, సూపరింటిండెంట్‌గా ఎస్.నాగరాజులను నియమించారు. లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 279 విద్యార్థులు సూపరింటిండెంట్‌గా ఎం.బుచ్చయ్య వ్యవహరించనున్నారు. కాగా విద్యార్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఎంఈఓ బి.అబ్బాయి సూచించారు. విద్యార్థులు పరీక్షలపై దృష్టిసారించాలని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి పది పరీక్షలు

తుని: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తుని నియోజకవర్గం పరిధిలో 40 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 3752 మంది విద్యార్థులకు 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఈవో పదవాడ గీతాదేవి ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 31 వరకూ పరీక్షలు జరగనున్నాయి. తుని పట్టణం, మండలంలో 2202 మందికి 12 కేంద్రాలు, తొండంగి మండలంలో 950 మందికి 4 కేంద్రాలు, కోటనందూరులో 600 మందికి 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుని పట్టణంలో రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సీతారాంపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, సిద్దార్థ, శ్రీచైతన్య, శ్రీప్రకాష్, భాష్యం, తుని మండలం ఎస్.అన్నవరం, తేటగుంట ఉన్నత పాఠశాలలు, వి.కోత్తూరు గిరిజన ఎస్సీ ఆశ్రమ పాఠశాల, హంసవరం ఏపీ మోడల్ పాఠశాలలో పరీక్షలు నిర్వహించనున్నాయి. తొండంగి మండలంలో బెండపూడి, దానదాయిపేట, తొండంగి, కొత్త పెరుమాళ్లపురం, కోటనందూరులో కోటనందూరు,, కొట్టాం, మదర్ విద్యాసంస్థల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను అందుబాటులో ఉంచామని గీతాదేవి తెలిపారు. పరీక్షలు జరిగే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పట్టణ సీఐ ఎం. గీతారామకృష్ణ తెలిపారు.

కిర్లంపూడి: మండలంలో సోమవారం నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈఓ–1 టి.జోసెఫ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో సుమారు 1100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు తెలిపారు. కిర్లంపూడిలో ప్రభుత్వోన్నత పాఠశాలలో 3 సెంటర్లు, బూరుగుపూడి, గెద్దనాపల్లి, తామరాడ ప్రభుత్వ పాఠశాలలతో పాటు జగపతినగరం ప్రగతి ప్రైవేట్ పాఠశాలతో కలిపి 7 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

రౌతులపూడి మండలంలో 534 మంది..

రౌతులపూడి: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ–2 గాడి కొండబాబు తెలిపారు. మండలంలోని రౌతులపూడి, ములగపూడి, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం జెడ్పీ హైస్కూళ్లు, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలతో పాటు రౌతులపూడి సెయింట్ థామస్ పాఠశాలకు చెందిన మొత్తం 534 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 250 మంది విద్యార్థులు రౌతులపూడి, 180 మంది విద్యార్థులు ములగపూడి, 180 మంది జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో పరీక్షల రాసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. రౌతులపూడి పరీక్ష కేంద్రానికి 15 మంది, ములగపూడి పరీక్ష కేంద్రానికి 10, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రానికి 10 మంది ఇన్విజిలేటర్లను, ఒక ముఖ్య పరీక్ష నిర్వహణాధికారి, డిఓను నియమించారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పరీక్ష కిట్ల పంపిణీ

తుని: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు అమర్ ఫౌండేషన్ ట్రస్టు అధ్యక్షుడు దల్లి అమర్‌నాథ్ ఆల్ ద బెస్టు చెప్పారు. స్థానిక బాలాజీ రోడ్డులో ఉన్న బీసీ బాలికల వసతిగృహం విద్యార్థినులు, పరీక్షలు రాసే 150 మంది విద్యార్థులకు ఆదివారం అమర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎగ్జామ్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సూచించిన సలహాలు పాటించి ధైర్యంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

శంఖవరం: స్థానిక అంబేడ్కర్ నగర్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. బహుజన సమాజ్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షుడు గునపర్తి అపురూప్ విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, పరీక్షలు అట్టలు, ఇతర సామగ్రి అందజేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

కోటనందూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్, మదర్ విద్యానికేతన్, పాతకొట్టాం హైస్కూల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 600 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరాలతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రాలను సిద్ధం చేస్తున్న అధికారులు



తునిలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందిస్తున్న అమర్ ఫౌండేషన్ ప్రతినిధులు



శంఖవరంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న నాయకులు